పోయింది. "రాఘవయ్య పెద్ద నవాబా ఏమిటి? తనపని తాను చేసుకోలేడూ? అతనికి తోడు సేవకులుకూడా కావాల్సొచ్చిందా?" అని కళ్లు కొరికాడు. రాజాగారు రాఘవయ్యను ద్వేషిస్తున్నాడన్న విషయం గంగడికి తేలిపోయింది. ఈమాగు రాజాగారి అండన చేరాడు. రాఘవయ్య మొగం చూడడంకూడ మానేసేడు. రాఘవయ్య మళ్ళీ పూర్వపు స్థితిలో పడిపోయాడు.

రాఘవయ్య కోకిలగానం, అతని నటనా చాతుర్యం రాణిగారి కటాక్షవీక్షణాల్ని ఆకర్షించాయి. రాఘవయ్య గొంతెత్తితే చాలు ఆ మధురగానానికి తన్మయత్వం చెంది నాగస్వరం ఆలకించే నాగములాగ ఆలకించేది. సాయంకాలం రాఘవయ్యతో రాజాగారు సంగీతాన్ని చర్చించేప్పుడు పక్క గదిలో పరదా చాటునుండి వింటూ సంతోషించేది. కొద్దికాలంలోనే రాజాగారి వాలకం మారిపోయింది. సంగీతంమీద సరదా సన్నగిల్లింది. ఎప్పటిలాగ వేళకు భోజనాదులు ముగించడం మొదలు పెట్టేడు. సాయంత్రం పూట సంగీతచర్చలు చాలించేడు.

మధ్యాహ్నం జమీందారీ విషయాల్ని చూడడం మొదలెట్టాడు రాజాగారు. ఒకరోజు అంతఃపురానికి కొంచెం ముందుగా వచ్చేసేడు. రాణీగారు ఏదో చదువుతుండటం కనిపెట్టి "ఏమిటా చదవటం" అని అడిగేప్పటికి రాణీ కొంచెం తత్తరపాటు చెందింది. అయినా వెంటనే తెప్పరిల్లుకొని "రాఘవయ్య రాసిన పాటలు చదువుతున్నాను. మీకు అకారణంగా సంగీతం మీద కోపం వచ్చినప్పట్నుండి పాటవినేందుకే అవకాశం లేకపోయింది చూడండి" అని సమాధానం తడుముకోకుండా చెప్పింది.

రాఘవయ్య భావిని గురించి కించిత్తైనా ఆలోచించకుండా ఆమర్నాటినుండి అతణ్ణి పనినుండి తొలగించేడు రాజాగారు. రాఘవయ్య ఎలా బతకగలడా అని కూడ ఆలోచించ దలచుకోలేదు రాజాగారు!

రాఘవయ్యకు రాజాగార్ని వదలి పోవటం అంటే ప్రాణం పోయినట్లయింది. రాజాగారిచ్చే జీతానికన్నా ఆయనయెడల వుండే స్నేహబంధం రాఘవయ్యను ఇన్నాళ్ళుబట్టీ రాజాగారి సేవలో నిమగ్నుణ్ణి చేసింది. ఎంత ఆలోచించినా తాను చేసిన తప్పేమిటో అర్థం కాలేదు రాఘవయ్యకు. "నాకర్మ, నా ప్రారబ్ధం" అనుకొని సంతృప్తిపడ్డాడు. ప్రశాంతంగా ఒక వేడి నిట్టూర్పు విడిచాడు; వీణతీసి పెట్టెలో పెట్టుకొన్నాడు; జేబులో మిగిలిన డబ్బులు గంగడి చేతులో పెట్టాడు; స్నేహితుడని అనుకోగలవాడెవడూ లేని విశాల విశ్వంలోకి ప్రశాంతంగా ప్రయాణం సాగించాడు.

(మూలం : రవీంద్రుడు)

# తా వలచింది సరస్వతి

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

ప్రపంచానికి వెండిపూత పూసే ఆహ్లాదం అత్యధికం చేస్తూంది జ్యోత్స్నాదేవి. వసంత ఋతువు. ఆదమే తావిగా మనోల్లాసం కలిగించే చంద్రికలు హిరణ్యంలాగ పేదలకీ రాజులకీ కూడా సంతోషాన్ని కలిగిస్తుంటే సహజంగానే ప్రకృతిసౌందర్యాన్ని ఆరాధించుకొనే అచ్యుతం మనస్సు మట్టుకు ఎందుకు సంతోషించదు?

మెడికల్ పరీక్షకి కూర్చుని ఫలితాలకోసం ఎదురుచూస్తూ అన్నగారింట్లో కాలం గడుపుతున్నాడు అచ్యుతం. సహజంగా ఇతను కళాప్రియుడూ సౌందర్యారాధకుడూను. పాతికేళ్ళ అవివాహిత యౌవనం. స్త్రీలన్నా, శృంగారమన్నా ఈ రెండు సంవత్సరాలనించీ ఇతనికి చాలా అభిమానం కలగడం అతనికే బాగా తెలుసును. తన ప్రాణ స్నేహితుడు రామారావుకి వచ్చే ప్రణయ లేఖలని చూసినప్పుడల్లా రామారావు హృదయంలో ఏవో కోర్కెలు అవ్యక్తంగా మొలకలెత్తి ఎందుచేతనో మళ్లా అంతరించేవి...తనవద్ద అరమరిక లేకుండా రామారావు ఆ అమ్మాయి వ్రాసిన ఉత్తరాలు చదివి

వినిపించడం, తనకి చూపడం అచ్యుతంలో ఒక కోర్కె రేపెట్టాయి ... ఏనాటికైనా అంత చక్కటి భావాలతో వ్రాసే కన్యని ప్రేమించి ఆమె వ్రాసే ప్రేమలేఖలు చూసుకొని మురిసి పోవాలి.

ఆలోచిస్తూ వెన్నెలలో ఊరిబయటి పొలాల లోకి నడిచాడు అచ్యుతం. టైము మహా అయితే ఏడున్నర అయివుంటుంది. ఇంకా ఇళ్ళలో సందడి వినిపిస్తూనే ఉంది. కరిగిపోసిన వెండిలాగ తళతళ లాడుతున్న చెరువు అచ్యుతం దృక్పథం దాట లేదు. పోయి ఆ గట్టుమీద కూర్చుని ఆలోచించడం మొదలుపెట్టేడు- ఫలితాలు రాగానే పట్నంలో ప్రాక్టీసు పెట్టాలి. అప్పటికి ఎవరో ఒక అమ్మాయిని వివాహం కూడా చేసుకోవాలని అన్నయ్య అంటాడు...సరే...కాని ఆ పిల్లకి సౌందర్యం ఉండాలి- ఆరోగ్యం బాగుండాలి- పాటరావాలి ... అన్నట్టు ముఖ్యంగా చక్కగా ఉత్తరాలు వ్రాసే శక్తి ఉండాలి. ఎందుచేతనంటే తను రేపు మిలిటరీకి పోయి ఆమెకి కొద్దిరోజులు దూరంగా ఉన్నా ప్రణయ లేఖలు వారిమధ్య దూరాన్ని మాయంచెయ్యాలి.

పాట ఏదో సన్నంగా వినిపించి అచ్యుతం భావప్రవాహానికి అడ్డంకి పెట్టింది. ఎవరో గాని ఎంత హాయిగా పాడుతున్నారు!

...మన్మధుడనీ చెలియా మనసు ఘోషించేనే
మరలీవత్తూ ... మన్నా... మరపురాకున్నాదే సఖియా...

ఎంత తియ్యనిగొంతుక! క్రమంగా తన దగ్గరకే వస్తూందని తెలిసికొన్నాడు...ఒక్కసారి అతని ఆలోచనా ప్రవాహంలో ప్రేమకథలూ, ప్రేమ చిత్రాలూ జ్ఞప్తికి వచ్చాయి...అదేదో సినిమాలోలాగ తను రెండవ చరణం అందుకుంటే రొమాంటిక్ గా ఉంటుందేమో- కాని తనకి పాటలో పాండిత్యం పూర్ణానుసారం-

ఆమె పాడుకుంటూ అతనికి నాలుగు గజాల దూరంలో ఉన్న చెట్టు అవతల నీరు ముంచుకుంటూంది.

నిండూచందురు ముఖమూ గండుకోకిల స్వరము
పండువెన్నెలలోన పవ్వళించేనమ్మా... సఖియా...
చుక్కల్లో చందురూడే చెలియా...

అచ్యుతం హఠాత్తుగా ఆ పాట ఆగిపోతుందని అనుకోకుండా ఎంతో జాగ్రత్తగా వింటున్నాడు ఒడలు మైమరచి...కాని బిందె ఎత్తివేసిన శబ్దం-తరవాత 'అమ్మా' అన్న బాధాసూచక శబ్దం అతన్ని ఒక్కసారి ఆమె పక్కకి తీసుకెళ్ళి పడవేశాయి...అతన్ని చూస్తూనే ఆమె- "ఓహో! డాక్టరుగారూ?" అంటూ కాలు చూపెట్టి "ముల్లు గుచ్చుకుపోయిందండీ-చాలా బాధగా ఉంది" అంది ముల్లు గోళ్ళతో బైటికి లాగుతూ.

సుమారు పదహారు సంవత్సరాలకంటె ఎక్కువ ఉండదామె వయస్సు. కొత్తగా విడచిన గులాబీ లాగ ఉంది. ఆ వెన్నెలలో ఆమె అందం మరీ విస్ఫారితంగా ఉంది. అచ్యుతం ఆమె కాలిని చేతిలోకి తీసుకుంటూ ఒక్కసారి ఈ లోకం మరచిపోయాడు. ఒక నిమిషంలో ముల్లు తీసేశాడు.

ఆమె నవ్వుతూ..."చాలా శ్రమపడ్డారు... ఫీజు ఏమిటి ఇచ్చుకోవాలో!" అంది.

స్వతహాగా అచ్యుతం మాటకారి కాదు. అందుచేత కాస్త గాభరాగా..."పటిటా ఇయ్య నక్కరలేదు లెండి" అన్నాడు. తడబడుతూ- ఎన్ని సినిమాలు చూసినా సరిగ్గా సమయం వచ్చే సరికి నోరు మెదలదు వెధవరోగం...

ఆనాటి రాత్రి పరిచయం మూడవనాటి రాత్రికి 'స్నేహం'గా మారింది. అచ్యుతానికి తన ప్రేమని వ్యక్తంచేసే ధైర్యంలేదు. కాని ఆమె చతురంగా సంభాషించడం, సౌందర్యంగా ఉండడం- అతనికి ఆమెను పెళ్లాడాలనే నిశ్చయం కలుగజేశాయి.

కాని సరిగ్గా ఈ సమయంలో అచ్యుతానికి ఈ ఫలితాలు రాకుండా ఉంటే బాగుండును... కాని కథకోసం కార్యాలు ఆగుతాయా? అచ్యుతం కృతార్థుడవగానే మదరాసు వెళ్ళి మిలిటరీలో ఉద్యోగం కోసం దరఖాస్తుపెట్టడం ఆ ఉద్యోగం రావడం జరిగింది. వెళ్తూ వెళ్తూ ధైర్యంచేసి సుశీల (ఆ అమ్మాయ్) ఉన్న ఇంటికి వెళ్లాడు (తనూ, ముసలితల్లీ మాత్రమే ఆ ఇంట్లో

ఉంటామని సుశీల ఇంతకుముందు అతనికి చెప్పింది) సుశీల గమ్మంలోనే ఉండడాన్ని తన ప్రయాణం మాట చెప్తూ ఉత్తరాలకి జవాబులు వ్రాస్తూండమని చెప్పి మరీ నిష్క్రమించేడు అపూర్వరిని౦చి.

*    *    *

అచ్యుతం ఇప్పుడు సైనిక వైద్యాధికారి డెహ్రాడూన్‌లో. ఈ వారం రోజులూ అతను సర్దుకోవడానికి సరిపోయాయి. అతను సుశీలకి ఉత్తరం రాశాడు...

సౌభాగ్యవతి సుశీలకి...

డ్యూటీలో జాయిన్ అయాను...ఎప్పుడూ నువ్వే నా మనస్సులో స్మరణం చేస్తూంటావు. నీ సహచర్యం నా జీవితంలో పెద్ద మార్పు తెచ్చిపెట్టింది. నేను నిన్ను మరువలేని స్థితికి వచ్చాను.

మనం వివాహం చేసుకుంటే ఆదర్శంగా ఉండే సంసారం చెయ్యగలుగుతాము ..... నీ ఉద్దేశం వ్రాస్తే నాలుగు నెలలలో సెలవుమీద వచ్చినప్పుడు నిన్ను నా దానినిగా చేసుకుంటాను.

భవదీయుడు

అచ్యుతం.

తను వ్రాసిన ఉత్తరంలో ఒకమాటకీ, మరొక మాటకీ సంబంధం ఉందో లేదో అతనికే తెలీదు. నాలుగుసార్లు చదివి పోస్టు చేశాడు.

జవాబు వస్తుందా రాదా? అనుమానంతోటే వస్తే తనని వివాహం చేసుకుంటానని వస్తుందా రాదా? అనే శంకతోటే వారం దినాలు గడచాక వచ్చింది ఆమెనించి ఉత్తరం. వణికే చేతులతో, తొణికే కంఠంతో చదివాడు...

శ్రీ అచ్యుతం గార్కి:

దయాపూరితమైన తమ ఉత్తరం అందింది. నన్ను మరువకుండా తమ మనోవీధులలో నన్ను దాచుకున్నందుకు కృతజ్ఞురాలిని.

మీ పరిచయం నా జీవితంలో కూడా చాలా చక్కటిమార్పు తెచ్చింది. మీ ప్రేమకి పాత్రురాలననే విషయం నాకు చాలా ఆనందం కలుగచేసింది.

బీదదాన్ని నేనందేహం లేకుండా మీరు నన్ను వివాహం చేసుకుంటానంటే ఎలాగ కాదనటం? ప్రేమ పూరితమైన మీ లేఖలు సర్వదా నన్ను సంతోషపెడతాయని నమ్ముతాను.

మీ-సుశీల

ఎంత చక్కగా రాసింది ఉత్తరం! పదిసార్లు చదివి ఆప్యాయంగా కోటులో దాచుకున్నాడు.

అచ్యుతం, సుశీల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నిర్విరామంగా రెండు సంవత్సరాలు జరిగాయి యిలాగ. తరువాత వచ్చిన ఉత్తరాలలో ఆంగ్లం బాగా వాడబడేదికూడా ... అచ్యుతం సుశీలకి ఇంగ్లీషుకూడా వచ్చునని గమనించి చాలా సంతోషించేడు.

ఒక శుభముహూర్తంలో వాళ్ల వివాహం అయింది.

ఎన్నాళ్ళబట్టో అచ్యుతం కోరుకుంటున్న ప్రథమ సమాగమపు దినం వచ్చింది.

సంభాషణ క్రమంగా ఉత్తరాలమీదికి వచ్చింది.

'ఎంత చక్కగా ఉత్తరాలు వ్రాసే దానివి సుశీ!' అన్నాడు అచ్యుతం.

జవాబు రాలేదు.

"నీ ఉత్తరాలు లేకపోతే నేను మిలిటరీలో పనే చెయ్యలేకపోదును.''

దీని కేజవాబు లేదు...

తరిచిఅడిగితే ఆమె అంది...''ఆ ఉత్తరాలు నేను వ్రాయలేదండీ...మీ వదినగారు మీ ఉత్తరాలన్నీ చదివి జవాబులు వ్రాసిపెట్టారు."

ఉగ్రుడైపోయాడు అచ్యుతం.

''—మరి నువ్వు...?"

ఆమె వణుకుతూ అంది-''నాకు ఆ అలే రావు"

మరొకప్పుడైతే జరిగిన మోసానికి ఆమెకి మెత్తగా దెబ్బలు తగిలేవి-కాని స్నిగ్ధకోమలంగా ఉన్న ఆమె రూపానికి కన్నీళ్లుకూడదని గ్రహించిన అచ్యుతం ఆమెని ఓదార్చి అన్నాడు—

''పోన్లే...అనుభవించాల్సిన ఆనందం ఎలాగా అనుభవించాను. ఇకమనం ఒక్కదగ్గరే వుంటాం-ఉత్తరా లెందుకూ ?... రేపటిన్నించి చదువు నేర్చుకో..."

ఇప్పుడామెకి రెండో తరగతి పుస్తకం క్షుణ్ణంగా వచ్చును.